
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శుక్రవారం 29 మార్చి 2024




గురుకుల ప్రవేశాల దరఖాస్తు గడువు పెంపు

ఎచ్చెర్ల, మార్చి 28: గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువు పెంచినట్లు ఎస్.ఎం.పురం పాఠశాల ప్రిన్సిపాల్, జిల్లా సమన్వయకర్త పి.శివప్రసాద్ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎచ్చెర్ల మండలం ఎస్.ఎం.పురం (బాలురు), గార మండలం వమరవల్లి(బాలికలు) గురుకుల పాఠశాలల్లో 5వ తరగతిలో పూర్తి సీట్లు, 6,7,8 తరగతుల్లో మిగిలిన సీట్ల భర్తీకి సంబంధించి ఏప్రిల్ 5 వరకూ దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. వాస్తవానికి ఈ నెల 31తో గడువు ముగియనుందని, విద్యార్థుల సౌలభ్యం కోసం గడువు పెంచామన్నారు. ప్రవేశ పరీక్ష తేదీలో ఎలాంటి మార్పు ఉండదని స్పష్టం చేశారు.

తమ్మినేనికి ఎదురీతే!

ఇటీవల మండల కోఆర్డినేటర్ ద్వారా వలంటీర్లకు వచ్చిన సందేశం



- వైసీపీ శ్రేణుల నుంచే ఎదురుదాడి
- ఇండిపెండెంట్ అభ్యర్థిగా సువ్వారి ప్రచారం
- సీతారామ్‌కు టికెట్ ఇచ్చిన వెంటనే పార్టీకి రాజీనామా

(ఆంధ్రజ్యోతి-శ్రీకాకుళం)

స్పీకర్ తమ్మినేని సీతారామ్‌కు ఈ సారి ఎన్నికల్లో సొంతపార్టీ (వైసీపీ) నుంచే ఎదురుదాడి తగులుతోంది. జగన్ ఒక్కచాన్స్ కారణంగా 2019 ఎన్నికల్లో ఆమదాలవలస నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా తమ్మినేని గెలుపొందారు. అనూహ్యంగా స్పీకర్ పదవి పొందారు. ప్రస్తుత ఎన్నికల్లోనూ ఆయనే వైసీపీ తరఫున బరిలో దిగనున్నారు. కాగా.. ఈసారి మాత్రం ఆయనకు సొంత పార్టీ నుంచే అసంతృప్తి సెగలు, వర్గపోరు కారణంగా ఎదురీత ఈదాల్సిన పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో ఎక్కడాలేనంతగా ఈ నియోజకవర్గంలో వైసీపీ నాలుగు వర్గాలుగా విడిపోయింది. పార్టీ కార్యక్రమాలే కాదు.. కొన్ని నెలల కిందట ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను సైతం వేర్వేరుగా జరుపుకొన్నారంటే పరిస్థితి ఎలా ఉందో ఊహించవచ్చు. ఎమ్మెల్యే అభ్యర్థిగా తమ్మినేని పేరు ఖరారు కాగానే.. గంటల వ్యవధిలో ఆమదాలవలస నియోజకవర్గంలో రాజీనామాల పర్వం జోరందుకుంది.

● రాష్ట్ర వైసీపీ సంయుక్త కార్యదర్శిగా సువ్వారి గాంధీ మొన్నటివరకు కొనసాగారు. ఓ పదవి విషయంలో గాంధీని తమ్మినేని సీతారాం పక్కనబెట్టారు. దీంతో వారి మధ్య వర్గ విభేదాలు పెరిగాయి. వైసీపీలోనే ఉంటూ నేరుగా తమ్మినేని ఎదురిస్తూ గాంధీ తిరుగుబావుటా ఎగురవేశారు. ఎట్టిపరిస్థితుల్లోనూ తమ్మినేనికి టికెట్ ఇవ్వకూడదని.. వెంటున్న వారికి న్యాయం చేయడం లేదని అధిష్ఠానానికి గాంధీ తెలిపారు. గాంధీ సతీమణి దివ్య పొందూరు మాజీ ఎంపీపీగా బాధ్యతలు నిర్వహించారు. తన బంధువైన సువ్వారి సువర్ణకు.. తమ్మినేనితో సంబంధం లేకుండానే జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పదవిని అధిష్ఠానం కట్టబెట్టింది. ఈ అవకాశాన్ని పాజిటివ్‌గా మలుచుకుని.. ఆమదాలవలస నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో బుక్ డిపో సెంటర్లను తెరిపించారు. యువతకు చిన్నపాటి ఉపాధి అవకాశాలు కల్పించారు. ఎన్నికలకు సమయం ఆసన్నమవడంతో ఇటీవల వర్గపోరును పక్కనబెట్టి వైసీపీ అధిష్ఠానం తమ్మినేనికే టికెట్ ఇచ్చింది. దీంతో అధిష్ఠానం తీరును వ్యతిరేకిస్తూ గాంధీ, తన సతీమణి దివ్య, తన బంధువు సువర్ణ.. ఇటు పార్టీ పదవులకు, అటు నామినేటెడ్ పదవులకు సైతం రాజీనామా చేసేశారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా బరిలో దిగి తమ్మినేనిని ఢీకొడతానని.. ఓడించి తీరుతానని ప్రచారం చేస్తున్నారు. తమ్మినేని అనుచరులు కూడా మద్దతుగా పాల్గొంటున్నారు. అలాగే వైసీపీ నాయకులు చింతాడ రవికుమార్, కోట గోవిందరావు సైతం తమ్మినేనికి వర్గానికి దూరంగా ఉంటూ సొంతంగా పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో వైసీపీలో సుమారు 20వేల ఓట్ల చీలిక జరిగే అవకాశం ఉంది. ఈ పరిణామాలతో సీతారామ్‌కు గడ్డుపరిస్థితి ఎదురుకాగా.. టీడీపీకి అనుకూల పవనాలు వీస్తున్నాయి.


తమ్మినేని సీతారాం

మన ఖాతాలో ఓట్లు పడాలి

- వలంటీర్లకు ఐప్యాక్ టీమ్ సందేశాలు

(మెళియాపుట్టి)

ఎన్నికల్లో విజయం సాధించేందుకు వైసీపీ అన్ని కుయుక్తులు పన్నుతోంది. ప్రధానంగా వలంటీర్ వ్యవస్థ ద్వారా ఓట్లు రాబట్టేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగా ఎన్నికల షెడ్యూల్ రాకముందే.. 'ఎలాగైనా సరే.. ఓట్లు మన ఖాతాలోనే పడాలి' అంటూ వలంటీర్లకు ఐప్యాక్ టీమ్ సందేశాలు పంపించింది. సచివాలయాలకు సంబంధించి మండల కోఆర్డినేటర్లను నియమించింది. వారి ద్వారా వలంటీర్లకు సంబంధించిన గ్రూప్ ఏర్పాటు చేసి.. వైసీపీకి అనుకూలంగా పనిచేయాలని సందేశాలు పంపుతున్నట్లు తెలుస్తోంది. మరోవైపు మళ్లీ మనం అధికారంలోకి వస్తే 'మీ భవిష్యత్ మాదీ' అంటూ వైసీపీ నేతలు కూడా వలంటీర్లకు భరోసా ఇస్తున్నారు. కొంతమంది అభ్యర్థులు ముందస్తుగా తాయిలాలు కూడా అందజేశారు. ఈ నేపథ్యంలో ఎన్నికల సంఘం వలంటీర్లు విధుల్లో పాల్గొంటే చర్యలు తప్పవని హెచ్చరిస్తున్నా.. కొంతమంది వైసీపీ ప్రచారంలో పాల్గొనడం చర్చనీయాంశమవుతోంది. ఈ నెల 18న మెళియాపుట్టిలో పాతపట్నం నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి తరఫున వలంటీర్లు ఇంటింటా ప్రచారం చేపట్టారు. కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ దృష్టికి ఈ విషయం చేరగా.. విచారణ చేపట్టి నివేదిక అందజేయాలని ఎంపీడీవో భాస్కరరావుకు ఆదేశించారు. ఈ మేరకు విచారణ చేపట్టి.. క్లస్టర్ నెంబర్-6లో పనిచేస్తున్న వలంటీరు మాడుగుళ్ల మణికంఠను విధుల నుంచి తొలగించిన విషయం తెలిసిందే. కాగా.. ఎన్నికల నిబంధనలు అడ్డంకిగా మారిన నేపథ్యంలో చాలామంది వలంటీర్లు రాజీనామా చేసి ప్రచారంలో పాల్గొనేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వచ్చేది రూ.5వేల వేతనమే కాబట్టి.. రాజీనామా చేసినా ఈ రెండు నెలలూ తాయిలాల రూపంలో ఎలా అయినా ఆ డబ్బులు వచ్చేస్తాయని భావిస్తున్నారు. మళ్లీ అధికారంలోకి వస్తే తమ ఉద్యోగాలు గ్యారంటీ అనే ధీమాతో వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఆరుగురు వలంటీర్ల తొలగింపు

సంతబొమ్మాళి, మార్చి 28: సంతబొమ్మాళి పంచాయతీతోపాటు బోరుభద్రలో వలంటీర్లు ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నట్లు సి-విజిల్‌కు ఫిర్యాదు అందింది. ఈ నేపథ్యంలో గురువారం ఆరుగురు వలంటీర్లను విధుల నుంచి తొలగించినట్లు ఎంపీడీవో ఉమాసుందరి తెలిపారు. టెక్కలి నియోజకవర్గ వైసీపీ అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్‌తో కలిసి.. సంతబొమ్మాళిలో వలంటీర్లు కల్లూరి పాపారావు, వాదాల దుర్గారావు, అట్టాడ కామేశ్వరరావు, బొమ్మాళి ఉమాశంకర్ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్నారు. దీనిపై టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు ఆధారాలతో సహా గురువారం సి-విజిల్‌కు ఫిర్యాదు చేశారు. ఆధారాలను పరిశీలించిన నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి టెక్కలి సబ్‌కలెక్టర్ సబ్ కలెక్టర్ నూరుల్‌కమర్.. ఆ నలుగురు వలంటీర్లను విధుల నుంచి తొలగించాలని ఆదేశాలు జారీ చేశారని ఎంపీడీవో ఉమాసుందరి తెలిపారు. ఈ మేరకు పంచాయతీ లాగిన్ నుంచి వారిని తొలగించాలని కార్యదర్శికి ఆదేశాలు జారీచేశామన్నారు. అలాగే బోరుభద్రలో ఉపాధిహామీ పనుల వద్ద వేతనదారులకు వైసీపీకి అనుకూలంగా వలంటీర్లు మల్ల అశ్విని, బొడ్డ శ్రీలత ప్రచారం చేస్తున్నారని సి-విజిల్‌కు ఫిర్యాదు అందిందన్నారు. దీనిపై విచారణ చేపట్టి ఆ ఇద్దరినీ విధుల నుంచి తొలగించామని ఎంపీడీవో తెలిపారు.

ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసు

జలుమూరు(సారవకోట), మార్చి 28: మూగుపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు చౌదరి లక్ష్మీనారాయణకు గురువారం షోకాజ్ నోటీసు జారీచేసినట్లు ఎంఈవో ఎం.వి.రమణ తెలిపారు. కోడ్ ఉల్లంఘించి సోషల్ మీడియాలో లక్ష్మీనారాయణ ఎన్నికల ప్రచారం చేశారని ఫిర్యాదు అందిందన్నారు. దీనిపై జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసు అందించి సంజాయిషీ కోరినట్లు ఎంఈవో తెలిపారు.

సెక్టార్ అధికారులు బాధ్యతతో పనిచేయాలి

- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్
- ఎంసీసీ కృష్ణారావు తీరుపై అసంతృప్తి

జలుమూరు, మార్చి 28: ఎన్నికల విధుల్లో సెక్టార్ అధికారులు బాధ్యతతో పని చేయాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. గురువారం జలుమూరు, సారవకోట మండలాల్లోని రెవెన్యూ కార్యాలయాల్లో సెక్టార్ అధికారులతో సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. 'పోలింగ్ సిబ్బంది.. మండల కేంద్రం నుంచి పోలింగ్ కేంద్రాలకు సకాలంలో చేరుకుని తిరిగి వెళ్లే వరకూ సెక్టార్ అధికారులదే బాధ్యత. పోలింగ్ కేంద్రాల్లో పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలి. 85 ఏళ్లు దాటి.. దివ్యాంగ ధ్రువీకరణ పత్రం ఉన్న దివ్యాంగులు ఇంటి వద్దనే ఓటు వేసేలా అవకాశం కల్పించాలి. జలుమూరు మండలంలో 80శాతం కన్నా తక్కువ పోలింగ్ అయ్యే గ్రామాలు 26 ఉన్నా యి. పోలింగ్ శాతం పెంచేలా ఓటర్లకు అవగాహన కల్పిం చాలి' అని ఆదేశించారు. సమావేశానికి గైర్హాజరైన ఎంసీసీ కృష్ణారావుపై అసంతృప్తి వ్యక్తం చేసారు. జిల్లా కార్యాలయానికి వచ్చి కృష్ణారావు సంజాయిషీ ఇవ్వాలని తహసీల్దారు నాగమ్మకు సూచించారు.

● చల్లవానిపేట గుంజుమెట్ట వద్ద వాహనాలను తనిఖీ చేస్తున్న ఫ్లైయింగ్ స్క్వాడ్‌తో కలెక్టర్ మాట్లాడారు. అనుమానం వచ్చిన ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని సూచించారు. కాగా.. రోజుకు రెండు షిఫ్ట్‌ల విధులు కష్టంగా ఉందని ఫ్లైయింగ్ స్క్వాడ్ సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై ఎస్పీతో మాట్లాడి.. చర్యలు చేపడతామన్నారు. అలాగే సారవకోట ఉన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రాన్ని కలెక్టర్ పరిశీలించారు. పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో నరసన్నపేట ఆర్వో జీవీఎస్ రామ్మోహనరావు, తహసీల్దార్లు సీహెచ్ నాగమ్మ, భాగ్యమతి, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంపీడీవోలు ఏ.దామోదరరావు, రాంబాబు పాల్గొన్నారు.


జలుమూరులో ఎన్నికల సెక్టార్ అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

పరీక్షల వేళ ఉపాధ్యాయులకు ఎన్నికల శిక్షణా?

పొందూరు, మార్చి 28: పదో తరగతి పరీక్షల విధుల్లో ఉన్న ఉపాధ్యాయులకు ఎన్నికల శిక్షణ తరగతులు నిర్వహించడం తగదని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పూజారి హరిప్రసన్న, పేడాడ కృష్ణారావు పేర్కొన్నారు. గురువారం పొందూరులోని డీటీఎఫ్ కార్యాలయంలో విలేకరులతో వారు మాట్లాడారు. ఈ నెల 30న పదోతరగతి వొకేషనల్ కోర్సుకు సంబంధించిన పరీక్షల్లో ఉపాధ్యాయులు ఇన్విజిలేటర్లుగా విధులు నిర్వహించాల్సి ఉంది. అదేరోజు శిక్షణ తరగతుల్లో పాల్గొనాలని ఆదేశాలు జారీచేశారన్నారు. అధికారుల మధ్య సమన్వయలోపం ఉపాధ్యాయులకు శాపంగా మారిందన్నారు. ఇప్పటికైనా అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని కోరారు.

మద్యం సీసాలతో ఇద్దరు అరెస్టు

శ్రీకాకుళం క్రైం, మార్చి 28: శ్రీకాకుళం నగరం దమ్మలవీధి సమీపంలోని బోడెమ్మకోవెల వద్ద ఇద్దరు వ్యక్తులు 25 మద్యం సీసాలతో ఫ్లైయింగ్ స్క్వాడ్‌కు పట్టుబడ్డారు. దమ్మలవీధికి చెందిన కోరాడ రమణమూర్తి, అల్లిపిల్లి వాసుదేవరావు గురువారం ప్రభుత్వ మద్యం దుకాణాల్లో 25 క్వార్టర్ మద్యం సీసాలను కొనుగోలు చేసి ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తున్నారు. డిప్యూటీ తహసీల్దార్ బి.సత్యవతి ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందంతో కలిసి దాడులు నిర్వహించగా వారిద్దరూ మద్యం సీసాలతో పట్టుబడ్డారు. వీరిని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించగా ఎస్ఐ-2 పి.కామేశ్వరరావు కేసు నమోదు చేశారు. వారిద్దరిపై పాత కేసులు ఉండటంతో.. వారిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఇలాగైతే.. సాగునీరు కష్టమే

- విరిగిన షట్టర్లు.. పేరుకుపోయిన చెత్త
- ఇదీ వంశధార కాలువ దుస్థితి

(పలాస)

పలాస నియోజకవర్గంలో వంశధార కాలువ పరిస్థితి అధ్వానంగా ఉంది. ఉన్నఫలంగా నీరు విడిచిపెడితే ఈ ప్రాంత శివారు భూములకు ఒక్క చుక్కకూడా నీరందని దుస్థితి నెలకొంది. 60టీ కాలువ ఈదురాపల్లి వద్ద మలుపులో షట్టర్లు విరిగిపోయాయి. పిల్ల కాలువకు నీరు విడుదలయ్యే ప్రాంతంలో ఉన్న షట్టర్లు సైతం తుప్పుపట్టి ఊడిపోయాయి. పలాసలోని జగన్నాథసాగరం వద్ద కాలువ మొత్తం చెత్త, మురుగునీటితో పూడుకుపోయింది. నియోజకవర్గంలో వంశధార ప్రారంభమయ్యే టెక్కలిపట్నం వద్ద కూడా పరిస్థితి దారుణంగా ఉంది. నియోజకవర్గంలో మొత్తం 16 కిలోమీటర్లు పొడవునా పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లో వంశధార కాలువ ద్వారా 5వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. గత 15 ఏళ్లగా కాలువకు మరమ్మతులు చేపట్టలేదు. పూడికలు కూడా తొలగించక పోవడంతో కాలువ మొత్తం పాడైంది. పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీ వ్యర్థ నీరంతా జగన్నాథసాగరం వద్ద చేరి కాలువ అంతా కప్పబడింది. దీనికితోడు స్థానికులు శుభకార్యాల్లో మిగిలిన వ్యర్థాలను కూడా ఇందులోనే వేయడంతో జీవరాశులు సైతం నశించిపోతున్నాయి.


పూడుకుపోయిన వంశధార ప్రధాన కాలువ..

ఆరేళ్లగా నీరు విడుదల చేయలేక పోవడంతో రైతులు ఊపిరి పీల్చుకున్నారు. లేదంటే వచ్చిన నీరు నేరుగా వ్యర్థాలతో కలిసి కాలువల్లో కాకుండా పొలాల్లోకి చేరి పంటలు పాడయ్యేవని అభిప్రాయపడుతున్నారు.


జగన్నాథసాగరం వద్ద వ్యర్థాలతో వంశధార కాలువ..


ఈదురాపల్లి వద్ద ధ్వంసమైన షట్టర్..

వంశధార ఆధారిత చెరువులు సైతం కలుషితమవుతున్నా అధికారులు మౌనం దాల్చుతున్నారని ఆరోపిస్తున్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వంశధారకు మోక్షం కలుగుతుందని భావించామని.. కానీ, ప్రకటనలే తప్ప హామీలు అమలుకావడం లేదని వాపోతున్నారు. పలాసకు వంశధార నీరు ఏ విధంగా తీసుకురావాలి.. కాలువ ఆధునికీకరణ వంటి పనులపై అధికారపార్టీ నేతలు దృష్టి సారించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రకృతిపైనే ఆధారపడి పంటలు పండించాల్సి వస్తోందని పేర్కొంటున్నారు.

రెండేళ్లకే బీటలు

- తహసీల్దార్ కార్యాలయ నిర్మాణంలో నాణ్యత లోపం
- బిక్కుబిక్కుమంటూ విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు

(సోంపేట)

సోంపేట తహసీల్దార్ కార్యాలయం రెండేళ్లకే బీటలు వారుతోంది. పాత తహసీల్దార్ కార్యాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో రెవెన్యూ సిబ్బంది భయాందోళనతో ఉద్యోగాలు నిర్వహించేవారు. దీంతో టీడీపీ హయాంలో నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన నిర్మాణం నిలిచి పోయింది. స్థానిక అధికారులు ఉన్న తాధికారులకు విజ్ఞప్తి చేయడంతో ఆదరబాదరాగా 2022 మార్చిలో కార్యాలయాన్ని నిర్మించి.. మంత్రులు ప్రారంభించారు. కాగా.. ప్రారంభించి రెండేళ్ల కాకముందే కార్యాలయంలో ఎక్కడ చూసినా బీటలు కనిపిస్తున్నాయి. ఆర్అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ లోపంతో కాంట్రాక్టర్ నాసిరకంగా పనులు చేపట్టాడనే ఆరోపణలు ఉన్నాయి. ఆర్ఐ, వీడియో కాన్ఫరెన్స్, సిబ్బంది గదులు ఇలా ఎక్కడ చూసినా.. బీటలు వారడంతో భయం భయంగా విధులు నిర్వహి స్తున్నామని ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.




తహసీల్దార్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ హాల్, సిబ్బంది గదుల్లో ఏర్పడిన బీటలు

సీసీ కెమెరాలు విరగ్గొట్టి..

- మూడు ఆలయాల్లో చోరీ

పలాస, మార్చి 28: పలాస మండలం లక్ష్మీపురం, బ్రాహ్మణతర్లా, బంటుకొత్తూరు గ్రామాల్లో పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, మంకినమ్మ, కాటమ్మతల్లి, శివాలయాల్లో బుధవారం అర్ధరాత్రి దాటిన తరువాత దొంగలు చోరీకి పాల్పడ్డారు. ఈ ఆలయాల్లో సీసీ కెమెరాలు విరగ్గొట్టి వెండివస్తువులు, ఇత్తడి సామగ్రితో పాటు విలువైన వస్తువులు దొంగిలించినట్లు ఆలయ అర్చకులు గుర్తించారు. ఈ మేరకు గురువారం కాశీబుగ్గ పోలీసులు ఫిర్యాదు చేశారు. లక్ష్మీపురం శివాలయంలోని సీసీ కెమేరాల వైర్లు కత్తిరించి.. శివలింగానికి ఉన్న వెండి నామాన్ని తస్కరించారు. బ్రాహ్మణతర్లా కాతమ్మతల్లి ఆలయంలో హుండీని పగలగొట్టి అందులో నగదు పట్టుకుపోయారు. ఈ రెండు ఆలయాల్లోనూ గతంలో కూడా రెండుసార్లు దొంగతనాలు జరిగాయి. దీనిపై ఎటువంటి చర్యలు లేకపోవడంతో దొంగలు మళ్లీ బరి తెగించి ఆలయాల్లో చోరీకి పాల్పడ్డారనే విమర్శలు ఉన్నాయి. కాశీబుగ్గ ఎస్ఐ పారినాయుడు ఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.


ఆలయంలో పగలగొట్టిన తలుపులు


లక్ష్మీపురంలో శివలింగానికి మాయమైన వెండి నామాలు


రక్షితనీటి పథకానికి రంగులు ఇలా..

రంగులు తొలగించరా?

జిల్లాలో సార్వత్రిక ఎన్నికల కోడ్ పూర్తిస్థాయిలో అమలుకావడం లేదు. ఈ నెల 16 నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి రాగా.. శ్రీకాకుళం మండలం పాత్రునివలసలో ప్రజల కోసం నిర్మించిన హుద్‌హుద్ ఇళ్లకు వేసిన వైసీపీ రంగులు ఇప్పటివరకూ తొలగించలేదు. అలాగే ఆ ప్రాంతంలోని మురుగునీటి శుద్ధి కేంద్రం భవనానికి కూడా వైసీపీ రంగులు కనిపిస్తున్నాయి. తాగునీటి పథకానికి, నగరపాలక సంస్థ చెత్త సేకరణ వాహనాలకు వేసిన వైసీపీ రంగులు తొలగించకపోవడం చర్చనీయాంశమైంది. ఎన్నికల నిబంధనల అమలులో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

\- శ్రీకాకుళం రూరల్


హుద్‌హుద్ ఇళ్లకు తొలగించని వైసీపీ రంగులు



పాతపట్నం: సభావేదికపై సంఘీభావం ప్రకటిస్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు



పోలాకి: కొత్తరేవులో సూపర్‌సిక్స్ పథకాలపై వివరిస్తున్న బగ్గు రమణమూర్తి

వైసీపీకి చరమగీతం పలకాలి

● తెలుగుదేశం పార్టీ నాయకుల పిలుపు

వైసీపీ నిరంకుశ పాలనకు చరమగీతం పలకాలని తెలుగుదేశం పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబునాయుడుతోనే రాష్ట్ర ప్రగతి సాధ్యమని చెప్పారు.గురువారం జిల్లాలో బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సూపర్‌సిక్స్ పథకాలపై టీడీపీ నాయకులు ప్రచారం నిర్వహించారు. అలాగే పోలాకి మండలంలో ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి పర్యటించారు. పాతపట్నంలో కూటమిలోని పార్టీల సమన్వయ సమావేశం, అభ్యర్థి పరిచయ వేదికను నిర్వహించారు.

నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యం: గోవిందరావు

పాతపట్నం: నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తానని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి మామిడి గోవిందరావు తెలిపారు. పాతపట్నంలో ఎన్‌డీఏ కూటమి పార్టీల సమన్వయ సమావేశం, అభ్యర్థి పరిచయవేదిక నిర్వహించారు. ఈసందర్భంగా ఎన్డీయే కూటమి లక్ష్య సాధనకు అందరూసమష్టిగా పనిచేసేందుకు సమావేశంలో తీర్మానించారు. ఎన్నికల్లో విజయం దిశగా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించడంలో అందరూ భాగస్వామ్యంకావాలని, సంపూర్ణ సహాయ సహకారాలు అందించాలని గోవిందరావు కోరారు.మాజీ ఎంపీపీ సలాన మోహనరావు, జనసేన ఇన్‌చార్జి గేదెల చైతన్య, కొరికాన భవాని బీజేపీ ఇన్‌చార్జి సలాన శరత్‌కుమార్ మాట్లాడుతూ ఉమ్మడికూటమి అభ్యర్థి గెలుపే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. అనంతరం స్థానిక నీలమణి దుర్గ ఆలయంలో ప్రత్యేకపూజలు చేశారు. ఆలయం నుంచి పట్టణంలో అంతరాబరోడ్ కూడలిలోగల ఎంజీఆర్ కార్యాలయంవరకూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పైల బాబ్జీ, జనసేన నాయకులు మిత్తన ప్రసాద్, నక్కక్రాంతి, అశోక్, పిట్టా హరి, జయరాజ్, బీజేపీ నాయకులు అమర చిరంజీవి ,దుక్క శ్రీకాంత్ పాల్గొన్నారు.

బీసీలకు అన్యాయం: బగ్గు

పోలాకి: వైసీపీ హయాంలో బీసీలకు అన్యాయం జరిగిందని నరసన్నపేట నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి ఆరోపించారు. కొత్తరేవు, సొండిపేట, జోగంపేట, కంబాలవానిపేట, కొవిరిపేట, సంతలక్ష్మీపురంల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సంక్షేమ పాలన చంద్రబాబుతోనే సాధ్యమన్నారు.కార్యక్రమంలో టీడీపీ నాయకులు బైరిభాస్కరరావు, ఎంపీ నాయుడు, చిట్టిసింహాచలం, సూరపునారాయణదాస్, కోరాడ నాగరాజు, త్రినాథ్, సూరపునాని, పంచిరెడ్డిసింహాచలం, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

●**సంతబొమ్మాళి:** టీడీపీ హయంలోనే తీరప్రాంత గ్రామాలు అభివృద్ధి చెందాయని ఆ పార్టీ మండల అధ్యక్షకార్యదర్శులు జీరు భీమారావు,రెడ్డి అప్పన్న తెలిపారు. కొవిరిపేటలో ఇంటింటా సూపర్‌సిక్స్ పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వారాధి చంటి,సూరాడ ధనరాజ్, బెండి అరుణ్‌కుమార్ పాల్గొన్నారు.

●**నందిగాం:** సూపర్‌సిక్స్ పథకాలతో ప్రజలకు మేలు చేకూరుతుందని తెలుగుదేశం నాయకులు పి.అజయ్‌కుమార్, ఎం.బాలకృష్ణ తెలిపారు. మండలంలోని కొత్తగ్రహారంలో సూపర్‌సిక్స్ పథకాల కరపత్రాలను పంపిణీచేసి వివరించారు. కార్యక్రమంలో బి.గిరిబాబు, ఎన్.తిరుపతి రావు, ఎం.సింహాచలం, ఆర్.రామారావురెడ్డి, బి.కిష్టమ్మ, ఎం.నాగరాజు, కె.ప్రసాదరావు పాల్గొన్నారు.

●**టెక్కలి:** టీడీపీని ప్రతి ఒక్కరూ ఆదరించి గెలిపించాలని ఆ పార్టీ మండలాధ్యక్షులు బగాది శేషగిరిరావు కోరారు. పిఠాపురం, నంబాళ్లపేటలో ఇంటింటా ప్రచారాం చేశారు.

● **హరిపురం:** మందస మండలం బాలిగాంలో టీడీపీ మండలాధ్యక్షుడు బావనదుర్యోధన ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో బాలిగాం కమిటీ అధ్యక్షులు బావన ఢిల్లీశ్వరరావు, నాయకులు తమిరి భాస్కర రావు, లబ్బరుద్రయ్య, ముడుమంచి నవీన్ గున్న రమణమూర్తి, గున్న రఘుపతి పాల్గొన్నారు.

కోడ్ ఉల్లంఘిస్తే సస్పెన్షన్: కలెక్టర్



ఎన్నికల సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

పోలాకి: ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన వారికి సస్పెండ్ చేస్తామని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ హెచ్చరించారు. గురువారం పోలాకి, వెదుళ్లవలస, పోలింగ్ కేంద్రాల్లో వసతులను పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల సెక్టోరల్ ఉద్యోగులతో సమీక్షించారు. ఎన్నికల నియమావళిని వివరించారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రసాద్, రిటర్నింగ్ అధికారి, ఎస్ఐ సత్యనారాయణ ఉన్నారు.

నిబంధనలు పాటించాలి: ఆర్వో



నరసన్నపేటలో సమావేశం నిర్వహిస్తున్న జీవీఎన్ రామ్మోహన్‌రావు

నరసన్నపేట: ఎన్నికల నిబంధనలు ప్రతిఒక్కరూ విధిగా పాటించాలని నరసన్నపేట నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జీవీఎస్ రామ్మోహన్‌రావు కోరారు. గురువారం నరసన్నపేటలో టీడీపీ, జనసేన, కాంగ్రెస్, వైసీపీ, సీపీఎం పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించే పీవోలు, ఏపీవోలకు శనివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి కంబకాయిజంక్షన్ సమీపంలోగల ఓ కల్యాణ మండపంలో శిక్షణఇవ్వనున్నట్లు చెప్పారు.206 మంది ఉపాధ్యాయులతోపాటు వివిధ శాఖలకు చెందిన ఉద్యోగులను కూడా ఎన్నికలసంఘం పీవో, ఏపీవోలుగా నియమించినట్లు తెలిపారు.

ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలి: ఎంపీ



అభయాంజనేయ స్వామికి పూజలు చేస్తున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

టెక్కలి: ప్రతిఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు కోరారు. గురువారం కోటబొమ్మాళి మండలంలోని యలమంచిలిలో దుర్గమ్మతల్లి ఆలయ 15వ వార్షికోత్సవం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈర్ష్య, అసూయ, ద్వేషాలకు ప్రతి ఒక్కరు దూరంగా ఉండాలని, ప్రజల్లో భక్తిభావం పెరిగినప్పుడే మానసిక అశాంతి తొలుగుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కింజరాపు ప్రసాద్, మాజీ ఎంపీపీలు తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, బోయిన రమేష్, నంబాళ్ల శ్రీనివాస్, వెలమల కామేశ్వరరావు పాల్గొన్నారు. అలాగే నిమ్మాడ జంక్షన్‌లో ఉన్న అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం పురస్కరించుకుని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు పూజలు నిర్వహించారు.

ఎలుగు బంట్ల దాడుల నుంచి కాపాడండి

●మానవ హక్కుల వేదిక నాయకుల డిమాండ్

వజ్రపుకొత్తూరు: తీరప్రాంత గ్రామాల్లో ఎలుగుబంట్ల దాడుల నుంచి ప్రజలను కాపాడాలని మానవహక్కుల వేదిక నాయకులు బీన ఢిల్లీరావు, పోతనపల్లి కామేశ్వరరావు, కోనారి ఈశ్వరమ్మ, ఇరోతు గురుమూర్తి, గుండు కృష్ణమూర్తి, అమీరుల్లా బేగం డిమాండ్‌చేశారు. మండలంలోని అనకాపల్లి గ్రామస్థులపై ఇటీవల ఎలుగు బంటిదాడి చేయడంతో ఇద్దరు మృతిచెందగా ఒకరు తీవ్రంగా గాయపడడంతో బాధిత కుటుంబాలను గురువారం పరామర్శించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలుగు బంట్ల దాడుల్లో మృతుల సంఖ్యపెరుగుతున్నా శాశ్వత పరిష్కారం చూపడం లేదని ఆరోపించారు.



ఇచ్ఛాపురం: ఈదుపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న మహిళలు



జి.సిగడాం: ర్యాలీ చేస్తున్న వెలుగు, రెవెన్యూ సిబ్బంది



టెక్కలి: భీంపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఓటు హక్కు స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

● ప్రతిజ్ఞ చేయించి, అవగాహన కల్పించిన అధికారులు ● జిల్లా వ్యాప్తంగా ఓటు హక్కు వినియోగంపై ర్యాలీలు

ఓటు హక్కు వజ్రాయుధమని, స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పలువురు అధికారులు పిలుపునిచ్చారు. ఈ మేరకు రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగంపై అధికారులు ప్రజల్లో అవగాహన కల్పించారు. ఉపాధి వేతనదారులు, కార్మికులతోపాటు వివిధవర్గాల ప్రజలతో ఓటుతప్పనిసరిగా వినియోగించేలా ప్రతిజ్ఞ చేయించారు. గురువారం జిల్లాలో పలు చోట్ల ఓటు హక్కు వినియోగంపై ర్యాలీలు నిర్వహించడంతోపాటు మానవహారాలు ఏర్పాటుచేశారు.

- ఆంధ్రజ్యోతి బృందం



నందిగాం: ఓటర్లచే ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు



సరుబుజ్జిలి: షలంత్రిలో ప్రతిజ్ఞచేయిస్తున్న తహసీల్దార్ రమేష్‌బాబు



హిరమండలం: ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పిస్తున్న తహసీల్దార్ సుధాకర్



సోంపేట: బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్వో సుదర్శనదొర



నరసన్నపేట: తామరాపల్లిలో ఉపాధి వేతనదారులకు అవగాహన కల్పిస్తున్న వెలుగు అధికారులు



పలాస రూరల్: పలాస ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఓటుహక్కుపై ప్రజలకు వివరిస్తున్న అధికారులు

వైసీపీ ప్రచారానికి తలతరియా సర్పంచ్ దూరం

జలుమూరు: మండలంలోని తలతరియా సర్పంచ్ చల్ల షణ్ముఖరావు వైసీపీ ఎన్నికల ప్రచారానికి దూరంగా ఉన్నారు. గురువారం ఆ పార్టీ అభ్యర్థి ధర్మాన కృష్ణదాసు తలతరియా పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించినా షణ్ముఖరావు ప్రచారానికి తన అనుచరులతోపాటు డుమ్మా కొట్టారు. కాగా వైసీపీ ప్రభుత్వంలో సర్పంచ్‌లకు గౌరవం లేదని షణ్ముఖరావు తెలిపారు. వచ్చేనెల 5న నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి సమక్షంలో టీడీపీ చేరుతున్నట్లు ప్రకటించారు.

దివ్యాంగుల ఉపకరణాల నిర్ధారణ శిబిరం

టెక్కలి: టెక్కలి భవితకేంద్రంలో సమగ్రశిక్ష ఆధ్వర్యంలో టెక్కలి, సంతబొమ్మాళి, నందిగాం, వజ్రపుకొత్తూరు, పాతపట్నం, మెళియాపుట్టి మండలాల్లో దివ్యాంగులకు అవసరమైన ఉపకరణాలకు నిర్ధారణ వైద్యశిబిరం గురువారం నిర్వహించారు. ఈసందర్భంగా స్టేట్ అసిస్టెంట్ ఐఈ కో-ఆర్డినేటర్ అమ్మినాయుడు మాట్లాడుతూ పదినుంచి 18 సంవత్సరాల లోపు వయస్సు ఉన్న వారికి గుర్తించినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు విజయ్‌కుమార్, ప్రసన్నకుమారి, వెంకట రాకేష్, సత్యసాయి, జిల్లా సహిత విద్య ఉపసమన్వయకర్త ఉమ, మండల విద్యాశాఖాధికారులు డి.తులసీరావు, చిన్నారావు పాల్గొన్నారు.

ఇంద్రపుష్కరిణి అభివృద్ధికి భూమిపూజ

టెక్కలి: మండలంలోని కె.కొత్తూరు కాశీవిశ్వేశ్వరాలయ ప్రాంగణంలో గల ఇంద్రపుష్కరిణి అభివృద్ధికి గురువారం సర్పంచ్ మొర్రి శంకర్ ఆధ్వర్యంలో భూమిపూజ నిర్వహించారు.ఈ మేరకు శంకరవనం ఫౌండేషన్ చైర్మన్, షిర్డీసాయి చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధి దుక్క రమేష్‌రెడ్డి రూ.25వేలు విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో కోరాడ నాగభూషన్, శ్రావణి, బోళ్ల భాస్కర రావు, దల్లి సుభద్ర, బైరాగి, ప్రకాష్, రామలింగయ్య, అర్చకులు రమేష్‌శర్మ, బొంగు పావని, మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

నందిగాం: మండలంలోని పెద్దతామరాపల్లి గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైనట్లు వచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదుచేసినట్లు ఎస్ఐ మహ్మద్ అమీర్ ఆలీ తెలిపారు. ఈనెల 23న ఇంటినుంచి బయటకు వెళ్లిన తమ కుమార్తె కోనారి మాధవి(22) తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆచూకీ కోసం వెతికారు. అయితే ఎక్కడా కనిపించకపోవడంతో గురువారం మాధవి తల్లి అన్నపూర్ణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

చొర్లంగిలో శివాలయ ప్రతిష్ఠా మహోత్సవం



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని చొర్లంగిలో చౌడేశ్వరి సహిత చొర్లంగేశ్వరస్వామి సాంగ శివాలయ ప్రతిష్ఠా మహోత్సవంలో భాగంగా గురువారం మహిళలు ముర్రాటలు తీసుకువెళ్లారు. అనంతరం స్వామివారికి పురోహితులు నేతేటి రమణమూర్తి శర్మ ఆధ్వర్యంలో పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు బి.చిన్నయ్య, ఎం.సూర్యనారాయణ, ఎస్.జగ్గునాయుడు పాల్గొన్నారు.

మోదుగులపుట్టిలో ఆర్మీజవాన్ అంత్యక్రియలు



ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహిస్తున్న దృశ్యం

పలాసరూరల్: మండలంలోని మోదుగులపుట్టిలో ఆర్మీజవాన్ మద్దిలజోగారావు అంత్యక్రియలు గురువారం ప్రభుత్వ లాంఛనాలతో జరిగాయి. మోదుగులపుట్టికి చెందిన మద్దిల జోగారావు జమ్మూకాశ్మీర్‌లోని ఉద్దంపూర్ రేంజ్‌లో ఆర్మీజవాన్‌గా పనిచేస్తున్నారు. సోమవారంరాత్రి మృతి చెందడంతో మృతదేహం బుధవారం రాత్రి మిలటరీ అధికారులు స్వగ్రామానికి తీసుకువచ్చారు. ఈ మేరకు గురువారంఉదయం కుటుంబసభ్యులు, గ్రామస్థులు ఆధ్వర్యంలో ప్రభుత్వ లాంచనాలతో అంత్యక్రియలు జరిపారు. మంత్రి సీదిరి అప్పలరాజు కుటుంబసభ్యులకు సంతాపం తెలిపారు. కార్యక్రమంలో మోదుగులపుటి గ్రామస్థులు, ఎంపీపీ ఉంగ ప్రవీణ, రిటైర్డు జవాన్లు, చుట్టుపక్కల గ్రామస్థులు పాల్గొన్నారు.

యంత్రాలు చెక్ చేయించుకోవాలి



కంప్యూటర్ కాటాను పరిశీలిస్తున్న తూనికలు, కొలతలు శాఖ అధికారులు

నరసన్నపేట: వ్యాపారులు, రేషన్ షాపులు డీలర్లు తూనిక యంత్రాలను చెక్‌చేయించుకొని సీళ్లు వేసుకోవాలని తూనికలు కొలతల శాఖ ప్రాంతీయ పర్యవేక్షకుడు కె.రాజారమేష్ తెలిపారు. గురువారం నరసన్నపేటలో కంప్యూటర్ కాటాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినియోగదారులను మోసగించేందుకు, అక్రమాలకు పాల్పడకుండా తూనికల శాఖ వేసిన సీళ్లు ఉంచాలన్నారు. అక్రమాలకు పాల్పడే వ్యాపారులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. జీరో రీడింగ్ చూసుకోని వినియోగదారులు కంప్యూటర్ కాటాలపై తూనికలు చూడాలన్నారు. రేషన్ డీలర్లు నిబంధనలు పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి



నిరసన తెలుపుతున్న సెక్యూరిటీ సిబ్బంది

అరసవల్లి: రిమ్స్ సెక్యూరిటీ పెండింగ్ వేతనాలు చెల్లించాలని, సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ అమ్మన్నాయుడు, రిమ్స్ కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ యూనియన్ గౌరవాధ్యక్షుడు బి.మురళి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం యూనియన్ ఆధ్వర్యంలో రిమ్స్‌లో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతీ నెల 5వ తేదీలోగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అతి తక్కువ వేతనంతో సెక్యూరిటీ సిబ్బంది దుర్భర జీవితాలు అనుభవిస్తున్నారని, వారి సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వ్యవహరించడం సరికాదన్నారు. నెల నెలా వేతనాలు చెల్లించడంలో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఏజెన్సీలను రద్దు చేసి, సెక్యూరిటీ, శానిటేషన్ సిబ్బందిని ఆప్కాస్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, రిమ్స్ యూనియన్ అధ్యక్షుడు ఎం.సూర్యనారాయణ, కార్యదర్శి రాజేంద్ర, కోశాధికారి ఆర్.చిన్నారావు, రిమ్స్ నాయకులు కె.రవికుమార్, జి.అప్పన్న, బి.శ్రీను, రవి, చంద్రశేఖర్, బద్రి, సోమేష్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆదిత్యుని హుండీల ఆదాయం రూ.43.09 లక్షలు



హుండీల ఆదాయాన్ని లెక్కిస్తున్న దృశ్యం

అరసవల్లి: ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి హుండీల లెక్కింపు గురువారం ఆలయ అనివెట్టి మండపంలో జరిగింది. 31 రోజులకు గాను రూ.43,09,655 ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో ఎస్.చంద్రశేఖర్ తెలిపారు. ఇందులో నోట్లు రూపేణా రూ.41,45,262, చిల్లర రూపంలో రూ.1,64,393 లభించాయి. బంగారం 61 గ్రాములు, వెండి 1.6 కిలోలు, యూఎస్ డాలర్స్ 18 లభించాయన్నారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త ఇప్పిలి జోగి సన్యాసిరావు, ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ, దేవాదాయశాఖ ఏసీ ప్రసాదరావు పట్నాయక్, పాలకమండలి సభ్యులు లుకలాపు గోవిందరావు, నెమలపురి కోటేశ్వరరావు, జటగడుగుల శ్రీనివాస్, దేవదాయశాఖ సీనియర్ అసిస్టెంట్ రవికుమార్, ఆలయ అర్చకులు, సిబ్బంది, శ్రీహరిసేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



మాట్లాడుతున్న ఎస్ఐ కృష్ణ ప్రసాద్

గార: శ్రీకూర్మం పంచాయతీ సెగిడిపేట, జెల్లపేటలో పోలింగ్ కేంద్రాలను గార ఎస్ఐ కె.కృష్ణ ప్రసాద్ గురువారం ఉదయం పరిశీలించారు. ఈ పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌వోలతో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

ఆలోచింపజేసిన 'కౌసల్యా సుప్రజా రామా'



నాటికలోని ఓ సన్నివేశం

శ్రీకాకుళం కల్చరల్: సుమిత్రా కళాసమితి ఆధ్వర్యంలో జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు బాపూజీ కళామందిర్‌లో గురువారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కొలకలూరికి చెందిన శ్రీ సాయి ఆర్ట్స్ వారి ఆధ్వర్యంలో గోపరాజు విజయ్ దర్శకత్వంలో 'కౌసల్యా సుప్రజా రామా' అనే నాటిక ఆహుతులను ఆలోచింపజేసింది. అదేవిధంగా కాకినాడకు చెందిన శ్రీసాయి కార్తీక క్రియేషన్ దర్శకుడు సీహెచ్ మహేష్ ఆధ్వర్యంలో ఎడారిలో 'వాన చినుకు' ఆకట్టుకుంది. శుక్రవారం 'మూల్యం కబ్జా' నాటికలు ప్రదర్శించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

సత్యనారాయణస్వామికి పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు

సోంపేట: సోంపేట పట్టణంలో నూతనంగా నిర్మించిన సత్యనారాయణ స్వామి ఆలయ ప్రారంభోత్సవం ఘనంగా జరిగింది. గురువారం విగ్రహ ప్రతిష్ఠలో భాగంగా స్వామివారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం ధాన్యంతో స్వామివారికి అభిషేకం చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఈఆర్‌కు ఘనస్వాగతం



ఎన్ఈఆర్‌కు స్వాగతం పలుకుతున్న బీజేపీ నాయకులు

రణస్థలం: ఎచ్చెర్ల నియోజకవర్గం బీజేపీ అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్)కు గురువారం రామతీర్థం జంక్షన్ వద్ద టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నాయకులు ఘనస్వాగతం పలికారు. ఎచ్చెర్ల నియోజకవర్గం ఉమ్మడి అభ్యర్థిగా ఎన్ఈఆర్‌ను ప్రకటించిన అనంతరం అమరావతి నుంచి రణస్థలం చేరుకున్న ఆయనకు స్వాగతం పలికి పూలమాలలు వేసి, హారతులు ఇచ్చారు. తొలుత రామతీర్థం జంక్షన్ వద్ద అభయాంజేయ స్వామికి పూజలు చేసి, కమ్మసిగడాం మహాలక్ష్మి అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు డీజీఎం ఆనందరావు, దెయ్యం వసంతరావు, గొర్లె లక్ష్మణరావు, కొప్పిశెట్టి లక్ష్మణ, యిజ్జాడ శ్రీనివాసరావు, లంక అప్పలనాయుడు, గొర్లె శ్రీహరి, పలువురు అభిమానులు పాల్గొన్నారు.

● **జి.సిగడాం:** చ్చెర్ల నియోజకవర్గం బీజేపీ అభ్యర్థిగా నియమితులై అమరావతి నుంచి జిల్లాకు వస్తున్న ఎన్ఈఆర్‌కు విశాఖ విమానాశ్రయంలో మండల బీజేపీ ఘనస్వాగతం పలికారు. మండల అధ్యక్షుడు వజ్జపర్తి రఘురాం, ప్రధాన కార్యదర్శి మీసాల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కంచిలి మండల సమావేశం రేపు

కంచిలి: మండల పరిషత్ కార్యాలయంలో సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 30న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శని వారం ఉదయం 10గంటల నుంచి జరిగే సమావేశానికి ప్రజా ప్రతినిధులంతా పాల్గొనాలని, అధికారులంతా పూర్తి సమాచారంతో హాజరు కావాలన్నారు.

రాళ్లు తేలిన రహదారి

● నిధులు మంజూరైనా పూర్తికాని పనులు



రాళ్లు తేలి అధ్వానంగా తయారైన కొల్లపేట రోడ్డు

గార: మండలంలో వివిధ గ్రామాలకు వెళ్లే రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరైనా నేటికీ కనీసం మరమ్మతులు కూడా చేయని దుస్థితి ఏర్పడింది. నిత్యం రద్దీగా ఉండే కొల్లపేట పంచాయతీరాజ్ రోడ్డు రాళ్లు తేలిపోయాయి. కనీసం కాలినడకకు కూడా స్థానికులు అవస్థలు పడుతున్నారు. శ్రీకూర్మం రోడ్డు నుంచి 1.9 కిలోమీటర్లు దూరం ఉన్న ఈ రోడ్డు అభివృద్ధికి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.36 లక్షలు నిధులు మంజూరయ్యాయి. ఆ తర్వాత ఐదుసార్లు టెండర్లు పిలిచినా పనులు ప్రారంభం కాలేదు. ఎట్టకేలకు కొన్నాళ్ల కిందట ఓ కాంట్రాక్టర్‌కు ఈ పనులు అప్పగించారు. కొంతవరకు జంగిల్ క్లియరెన్సు పనులు చేపట్టారు. దీంతో రహదారి కష్టాలు తీరిపోతయాని స్థానికులు సంతోషపడ్డారు. పోనీ ఇప్పుడైనా ఈ రోడ్డు పనులు పూర్తయితే తమ కష్టాలు తీరుతాయని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు ఈ రోడ్డు పనులు తొందరలో పూర్తి చేయించి అందుబాటులోకి తీసుకు రావాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీరాజ్ ఏఈ కేసీహెచ్ మహంతి వద్ద ప్రస్తావించగా.. ఈ రోడ్డు పనులు ప్రారంభించారని, సకాలంలో పనులు పూర్తి చేయించేందుకు చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు.

ప్రమాదకరంగా కేదారిపురం రోడ్డు



గోతులతో ప్రమాదకరంగా మారిన రహదారి

ఇచ్ఛాపురం: పురుషోత్తపురం నుంచి కేదారిపురానికి వెళ్లే రహదారి గతుకులతో అత్యంత ప్రమాదకరంగా మారింది. దీంతో ప్రజలు, వాహనదారులు తరుచూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ఈ గ్రామాల మధ్యలో పురుషోత్తపురం మోడల్ స్కూల్ ఉంది. రోడ్డు బాగా లేకపోవటంతో సైకిళ్లపై వచ్చే విద్యార్థులు కూడా ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా రాత్రిపూట వాహనదారులు గోతుల్లో పడి గాయాల పాలవుతున్నారు. రహదారిని బాగుచేయాలని రెండు గ్రామాల ప్రజలతో పాటు విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

రోడ్డు వేశారు.. బెర్ములు మరిచారు



బెర్ములు వేయకుండా వదిలేసిన దృశ్యం

మందస: మందస ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో మెయిన్ గేట్ నుంచి కళాశాల రోడ్డు వరకూ సీసీ రోడ్డును నిర్మించారు. అయితే రోడ్డు వేసి నెలలు గడుస్తున్నా ఇరువైపులా బెర్ములు వేయలేదు. దీంతో కళాశాలకు వెళ్లే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఐటీడీఏ అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా బెర్ములు వేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రోడ్డు పక్కన చెత్త.. రాకపోకలకు కష్టాలు



లింగాలపాడు కాలనీ రోడ్డు పక్కనే వేసిన చెత్త

జలుమూరు: తలతరియా పంచాయతీ లింగాలపాడు కాలనీ వద్ద రోడ్డు పక్కన చెత్త పేరుకుపోవడంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించే గ్రామస్థులు దుర్వాసనతో అవస్థలకు గురవుతున్నారు.గ్రామ సచివాలయానికి కూతవేటు దూరంలో ఉన్న కాలనీకి సమీపంలో చెత్త నిల్వ ఉన్నా సిబ్బంది తరలిం చడం లేదు. ఇక్కడి సచివాలయ సిబ్బంది చెత్త నిర్వహణపై చర్యలు తీసుకోవడంలేదని గ్రామస్థులు వాపోతున్నారు. ఇప్పటికైనా రోడ్డుపక్కనే ఉన్న చెత్తను తొలగించాలని వారంతా కోరుతున్నారు.

ఆ మలుపు.. ప్రమాదాలకు పిలుపు



ప్రమాదకరంగా మలుపు ఉన్న దృశ్యం

సరుబుజ్జిలి: ఆమదాలవలస, సరుబుజ్జిలి మండలాల సరిహద్దు ప్రాంతమైన మునగవలస జంక్షన్ వద్ద ఉన్న మలు ప్రమాదలకు పిలుపుగా మారింది. అలికాం-బత్తిలి ప్రధాన రహదారిలో ఉన్న ఈ మలుపు వద్ద గతంలో పలు రోడ్డు ప్రమాదాలు జరిగి కొంతమంది మృత్యువాత పడగా మరికొంతమంది తీవ్రగాయాలపాలైన ఘటన ఉన్నాయి. ఈ రహదారిలో ప్రతిరోజూ వందల సంఖ్యలో భారీ వాహనాలు ద్విచక్ర వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రహదారిలో కొత్తగా వచ్చే వాహనదారులు మలుపు ఉన్నట్టు తెలుసుకకపోవడంతో అతి వేగంగా వచ్చే సమయంలో ప్రమాదాని గురవుతున్నారు. సంబంధిత అధికారులు ఇటువంటి మలుపుల వద్ద కనీసం హెచ్చరిక బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంతో వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు. ఇప్పటికైనా రోడ్లు భవనాల శాఖ అధికారులు స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలని వాహనచోదకులు, స్థానికులు కోరుతున్నారు.

పెండింగ్ పనులపై మరింత దృష్టి పెట్టాలి

● కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్



మాట్లాడుతున్న కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్: కన్వర్జెన్సీ పనులపై పీవో, ఏపీవోలు దృష్టి సారించాలని, పెండింగ్‌లో ఉన్న పనులను పూర్తి చేయాలని కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉపాధి హామీ పనులపై ఎంపీడీవోలు, పీవోలు, ఏపీవోలతో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఒక్కొక్క ఏపీడీ పరిధిలో ఏయే పనులు చేస్తున్నదీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే మండలాల్లో నిర్ణయించిన లక్ష్యాలు, గ్రామ పంచాయతీల లక్ష్యం తదితర వివరాలపై ఆరా తీశారు. ఎంపీడీవోలు, హౌసింగ్ ఏఈలతో సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. కనీస పని దినాలపై దృష్టి సారించాలని, పనులు చేస్తున్న సమయంలో కార్మికులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ప్రథమ చికిత్స తప్పనిసరిగా ఉండాలని, తాగునీటి సరఫరాపై దృష్టి సారించాలన్నారు. మొక్కల పంపిణీపై మాట్లాడుతూ ఏయే మొక్కలు పంపిణీ చేస్తారు.. ప్లాంటేషన్ తక్కువగా ఉందని.. మొక్కల సంరక్షణపై దృష్టి సారించాలన్నారు. ఎన్నికల నియమావళి అమలులో ఉన్నందున విధులను జాగ్రత్తగా నిర్వహించాలని, వచ్చే సమావేశం నాటికి ప్రారంభం కాని పనులను అన్నింటినీ ప్రారంభించాలని ఆదేశించారు. ఎక్కువ పనిదినాలు కల్పించాలని, వేతనాలు అందజేయడంతో శత శాతం ఫలితాలు సాధించాలన్నారు. సమావేశంలో డ్వామా పీడీ జీవీ చిట్టిరాజు, ట్రైనీ కలెక్టర్ రాఘవేంద్ర మీనా తదితరులు పాల్గొన్నారు.

అరాచక ప్రభుత్వాన్ని సాగనంపండి: ఎంపీ



ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రామ్మోహన్, రవికుమార్

బూర్జ: రాష్ట్రంలో అరాచక పాలన సాగిస్తున్న వైసీపీని సాగనంపాలని ఎంపీ రామ్మోహన్‌నాయుడు, నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి కూన రవికుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం పెద్దపేట పంచాయతీలోని ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఇంటింటికి వెళ్లి కరపత్రాలను పంపిణీ చేశారు. అనంతరం బొమ్మిక, గిరడపేట, మదనాపురం గ్రామాల్లో పర్యటించి టీడీపీ అందించనున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, టీడీపీ, బీజేపీ, జనసేన పార్టీ నాయకులు పేడాడ రామ్మోహన్, పేడాడ సూరనాయడు, ఆనెపు రామకృష్ణ, మొదలవలస రమేష్, వావిలపల్లి సీతారాం, రామ్‌జీ, సత్యప్రసాద్, కృష్ణగోపి, విక్రమ్, నాగేంద్ర, జయరామ్, పిల్ల జగన్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పాలనలో రాష్ట్రం అధోగతి



మాట్లాడుతున్న గొండు శంకర్

అరసవల్లి: వైసీపీ నిరంకుశ పాలనలో అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారని శ్రీకాకుళం నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. గురువారం నగరంలోని కృష్ణాపార్కు జంక్షన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నియోజకవర్గ వ్యాప్తంగా తాగునీరు, సాగునీరు, మురుగు నీరు సమస్య తీవ్రంగా వేధిస్తోందని, డ్రైనేజీ వ్యవస్థ అధ్వాన పరిస్థితిలో ఉందన్నారు. నగరంలో ఇరుకైన రోడ్ల వల్ల ట్రాఫిక్ సమస్య ఎక్కువైందని వీటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తానన్నారు. నగరంలోని కోడి రామ్మూర్తి స్టేడియాన్ని పూర్తి శిథిలావస్థకు చేర్చిన ఘనత వైసీపీదేనన్నారు. బీసీల అభ్యున్నతి కోసమే బీసీ డిక్లరేషన్‌ను చంద్రబాబు ప్రకటించారన్నారు. టీడీపీ, బీజేపీ జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

టీడీపీ మేనిఫెస్టోతో వైసీపీలో వణుకు

అరసవల్లి: టీడీపీ మేనిఫెస్టోతో వైసీపీ నాయకుల్లో వణుకు మొదలైందని శ్రీకాకుళం నియోజకవర్గ టీడీపీ కూటమి అభ్యర్థి గొండు శంకర్ అన్నారు. గురువారం సాయంత్రం నగరంలోని బలగలో ఆయా వార్డు టీడీపీ ఇన్‌చార్జీలు, నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడారు. కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జీలు రెడ్డి సూర్యనారాయణ, కేవీఎస్ బుజ్జి, రెడ్డి గిరిజా శంకర్, దొండపాటి నవీన్‌కుమార్, కోరాడ హరగోపాల్, తంగి నర్సింగరావు, జనసేన నాయకుటు చిట్టి భాస్కరరావు, బీజేపీ నాయకుడు రావాడ పురుషోత్తం, సాధు కోటేశ్వరరావు, పరమేశ్వరరావు, టీడీపీ ముఖ్య నేతలు పాల్గొన్నారు.

సన్యాసిపుట్టుగలో సూపర్ సిక్స్..

ఇచ్ఛాపురం: తెలుగుదేశం పార్టీతోనే సంక్షేమ పథకాలు సాధ్యమని మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు అన్నారు. గురువారం సన్యాసిపుట్టుగ గ్రామంలో సూపర్ సిక్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ అందించనున్న పథకాలపై అవగాహన కల్పించారు. ఎమ్మెల్యేగా మళ్లీ బెందాళం అశోక్‌ను గెలిపించుకొనే బాధ్యత మనందరిపై ఉందన్నారు.

కూటమి విజయం తథ్యం

● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష



మాట్లాడుతున్న గౌతు శిరీష

పలాస: ప్రస్తుతం వైసీపీ పాలనలో రాష్ట్రం భ్రష్టుపట్టిందని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆరోపించారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి విజయం తథ్యమని తెలిపారు. పలాస టీడీపీ కార్యాలయంలో ఆమె గురువారం విలేక రులతో మాట్లాడుతూ ప్రస్తుతం వైసీపీ పాలనలో రాష్ట్రం అథమస్థాయికి చేరుకుం దన్నారు. ఒకటో తేదీ నాడు ఎవరికీ జీతాలు అందని పరిస్థితి నెలకొందన్నారు. దివాళా తీసిన రాష్ట్రానికి జవసత్వాలు అందించాలనే లక్ష్యంతో మూడుపార్టీలు జతకట్టి ముందుకు సాగుతున్నాయని తెలిపారు. ఈ కూటమి అధికారంలోకి రాగానే సాగు, తాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, ఉద్యో గాల కల్పన, ప్రతి విద్యార్థికి రూ.15 వేలు, దీపం పథకం కింద మహిళలకు మూడుగ్యాస్ కనెక్షన్లు, 18-59 ఏళ్ల మధ్య మహిళలకు ఆడబిడ్డనిధి కింద రూ.1500, బీసీ వర్గాలకు 50 ఏళ్లకు పింఛన్లు కల్పించనున్నట్లు ఆమె స్పష్టం చేశారు.

టీడీపీతోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న కొండా శంకర్‌రెడ్డి

ఇచ్ఛాపురం: చంద్రబాబుతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని టీడీపీ రాష్ట్ర రెడ్డిక బీసీ సాధికార సమితి కన్వీనర్ కొండా శంకర్‌రెడ్డి అన్నారు. గురువారం నీలావుపుట్టుగ, సన్యాసిపుట్టుగ, కేసుపురం గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. చంద్ర బాబు మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే రెడ్డిక కులస్థులకు న్యాయం జరుతుం దన్నా రు. జయహో బీసీ సభలో చంద్రబాబు బీసీలకు ఇచ్చిన హామీలు ఇచ్ఛాపురం ని యోజకవర్గంలో ప్రత్యేకంగా రెడ్డిక కులస్థులకు ఎంతగానో ప్రయోజనం కల్పిస్తాయ న్నారు. ఇంటింటికీ వెళ్లి టీడీపీ అధికారంలో వస్తే అమలు చేయనున్న పథకాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మణిచంద్రరెడ్డి, దక్కత ఢిల్లీరావు, ఆశి జీవులురెడ్డి, లీలారాణి, సహదేవ్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, ఎల్ తారకేష్‌రెడ్డి, గిన్ని చిన్నా పాల్గొన్నారు.

టీడీపీలో 60 కుటుంబాల చేరిక

పొందూరు: రాష్ట్రంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూట మికి పూర్తి మెజార్టీ అందించి సంపూర్ణ విజయం అందించడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఎంపీ కె.రామ్మోహన్‌నాయుడు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కూన రవికుమార్ అన్నారు. మండల కేంద్రంలో గాంధీనగర్‌వీధి సమీపాన గల దళితవాడలో నిర్వహించిన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. దళితవాడకు చెందిన కె.రా జేష్ ఆధ్వర్యంలో 60 కుటుంబాలు టీడీపీ చేరాయి. వీరికి కుండువా వేసి సాధారంగా పార్టీలోకి ఆహ్వానించారు. కా ర్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సీహెచ్ రామ్మో హన్, నాయకులు అన్నెపు రాము, సీపాన శ్రీరంగనా యకులు, బలగ శంకరభాస్కర్, అనకాపల్లి చినరంగ, బాడాన గిరి, ఎంపీటీసీ ఎ.వాణి, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లా సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ దాని అనుబంధ కళాశాలల్లో మూడు, ఐదేళ్ల లా కోర్సులు చదువుతున్న విద్యార్థుల 2, 5, 9 సెమిస్టర్ పరీక్ష ఫలితాలను విడుదల చేసినట్టు పరీక్షల విభాగం డీన్ డాక్టర్ ఎస్.ఉదయభాస్కర్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మూడేళ్ల లా కోర్సులో రెండో సెమిస్టర్‌లో 88కు 79 మంది, ఐదో సెమిస్టర్‌లో 110కు 109 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఐదేళ్ల లా కోర్సులో రెండో సెమిస్టర్‌లో 29కు 26 మంది, ఐదో సెమిస్టర్‌లో 21కు 17 మంది, తొమ్మిదో సెమిస్టర్‌లో 14కు 13 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని చెప్పారు. పరీక్ష ఫలితాల వివరాలను వర్సిటీ వెబ్‌సైట్, జ్ఞానభూమి పోర్టల్ అందుబాటులో ఉంచామన్నారు.

దీటుగా సన్నద్ధం కావాలి

శ్రీకాకుళం రూరల్: పోటీ ప్రపంచానికి దీటుగా సన్నద్ధం కావాలని మాజీ ఐఏఎస్ చక్రపాణి విద్యార్థులకు పిలుపునిచ్చారు. జెమ్స్ కళాశాలలో గురువారం ఎంటర్ ప్రెన్యూర్‌షిప్, లీడర్ షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన చక్రపాణి మాట్లాడుతూ.. సాంకేతికంగా వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు తెలుసుకుని, అందుకు అనుగుణంగా తమను తీర్చిదిద్దుకోవాలని, డిజిటల్ లిటరసీ పెంపొందించుకోవాలన్నారు. బొల్లినేని సంస్థ కూడా ఇంక్యూబేషన్ కేంద్రంగా రూపొందాలని ఆకాంక్షించారు. అనంతరం అయనను కళాశాల ప్రిన్సిపాల్ డా.లక్ష్మిలలిత, బొల్లినేని మెడ్ స్కిల్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు సన్మానించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో జెమ్స్ ఏవో సత్యనారాయణ, లైఫ్ స్కిల్స్ నిపుణులు జయదేవ్ తదితరులు పాల్గొన్నారు.

నాగబాబును కలిసిన దాసరి

ఇచ్ఛాపురం: సార్వత్రిక ఎన్నికల్లో ఇచ్ఛాపురం నియోజకవర్గంలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి బెందాళం అశోక్‌ని గెలిపించాలని జనసేన పార్టీ నాయకులు కె.నాగబాబు సూచించారు. మంగళగిరిలోని పార్టీ సెంట్రల్ ఆఫీస్‌లో ఇచ్ఛాపురం నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు ఆయన్ని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పార్టీ పరిస్థితిపై చర్చించినట్టు తెలిపారు.

12 మంది ఎంపిక

ఇచ్ఛాపురం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డెక్కన్ ఫైన్ కెమికల్స్ హెచ్‌ఆర్ మేనేజర్ ఫణి శశాంక ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో 12 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ రోబన్‌కుమార్ పాడి తెలిపారు. గురువారం కళాశాలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించిన జాబ్‌మేళాలో 40మంది నిరుద్యో గులు హాజరయ్యారు. వీరిలో ఏడుగురు పురుషులు, ఐదుగురు మహిళలు ఎంపికైనట్టు తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు శివకుమార్, సంతోష్‌కుమార్, నాగేశ్వరరావు, దుర్యోధన, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవి వెంటే ఉంటాం

గార: మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి నాయకత్వంలోనే మేమంతా కలిసి పనిచేస్తామని ఆమె వర్గీయులు స్పష్టం చేశారు. గురువారం ఉదయం వమరవల్లిలో నిర్వహించిన సమావేశంలో పాల్గొన్న పలువురు నాయకులు మాట్లాడుతూ.. ఉమ్మడి కూటమి అభ్యర్థిగా గుండ లక్ష్మీదేవికి టికెట్ కేటాయించాలని కోరారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు పార్టీకి వెన్నంటి ఉంటూ పార్టీ నిర్దేశించే ప్రతీ కార్యక్రమం నిర్వహిస్తూ నిరంతరం ప్రజల కోసం పని చేస్తున్నామన్నారు. కార్యకర్తల మనోభావాలు దృష్టిలో పెట్టుకొని చంద్రబాబు పునరాలోచన చేసి లక్ష్మీదేవికి ఉమ్మడి కూటమి అభ్యర్థిగా సీటు కేటాయించాలని కోరారు. ఈ నేపథ్యంలో గుండ లక్ష్మీదేవికి అఖండ మెజార్టీతో గెలుపు విజయం తథ్యమన్నారు. సమావేశంలో నాయకులు ఎల్.రాధాకృష్ణ రెడ్డి, పి.కృష్ణమూర్తి, జల్లు రాజీవ్, కైబాడి రాజు, మళ్ల అబ్బాయినాయుడు, పి.వైకుంఠరావు, జేసీ దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆందోళన చెందవద్దు

అరసవల్లి: శ్రీకాకుళం నియోజకవర్గంలో కార్యకర్తలు ఆందోళన చెందవద్దని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ అన్నారు. గురువారం తన స్వగృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జోనల్ కో-ఆర్డినేటర్ శ్రీనివాస్‌రెడ్డి ఇచ్చిన సమాచారం మేరకు రెండు, మూడు రోజుల్లో టీడీపీ అధినేత చంద్రబాబును కలిసి మీ అందరి అభిప్రాయాలను తెలియజేస్తామన్నారు. జోనల్ కోఆర్డినేటర్ సమక్షంలో కార్యకర్తలు తమ అభిప్రాయాలను చెప్పడం మాకు ఎంతో ధైర్యాన్నిచ్చిందన్నారు.

ఓటు వజ్రాయుధం

సోంపేట: ఓటు వజ్రాయుధం వంటిదని, ప్రతి ఒక్కరూ ధైర్యంగా ఓటు హక్కును వినియోగించు కోవాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుదర్శన్ దొర అన్నారు. గురువారం ఇచ్ఛాపురం, కంచిలి, సోంపేట మండలాలకు చెందిన బూత్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేటట్లు అంతా సహకరించాలని తెలిపారు. అనంతరం బైక్ ర్యాలీ నిర్వహించి ఓటు హక్కు వినియోగంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.విజయ్‌కుమార్, డీఎల్‌పీవో ఐవీ రమణ, ఎంపీకేఎస్ రవి, ఆర్ఐ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

పాలిథిన్ నివారణకు చర్యలేవీ?

● కవర్లు తిని చనిపోతున్న పశువులు

ఇచ్ఛాపురం: మున్సిపాల్టీ పరిధిలో విచ్చలవిడిగా ప్లాస్టిక్, పాలిథిన్ వాడుతున్నా మున్సిపల్ అధికారులు పట్టించుకోవడం లేదని సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. పాలిథిన్ రహిత మున్సిపాల్టీగా తీర్చుదిద్దుతామని చెప్పి ప్రచారాలు చేసిన మున్సిపల్ అధికారులకు ప్లాస్టిక్ విచ్చలవిడిగా వాడుతున్నా పట్టించుకోకపోవడం దారుణం. పాలిథిన్ కవర్లు, డిస్‌పోజబుల్ గ్లాసులు వివిధ కార్యక్రమాల్లో వాడుతుండడంతో పట్టణంలోని రోడ్డు పక్కన, ఎక్కడికక్కడ కుప్పలుతెప్పలుగా కనిపిస్తున్నాయి. వీటిని పశువులు తినేస్తుండడంతో చాలా వరకు మృత్యువాత పడుతున్నాయి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.